# బంగారి

కోటమర్తి రాధాహిమబిందు

ఈ ప్రయాణం నాకెంతో సంతోషంగా ఉంది... నాన్న కోదాడ బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయింది... నాలుగు సంవత్సరాల తర్వాత కోదాడ వెళ్తున్నాను..నా ఈ సంతోషానికి కారణం బంగారి.

అప్పట్లో కోదాడలో నాకో ఫ్రెండ్ ఉండేవాడు పేరు ఉపేందర్... అతని గృహప్రవేశానికి వెళ్లాను. అతని కోరిక మీద నాలుగు రోజులు వున్నాను.

నాకు మనుషులు మమతల పట్ల ప్రేమ భావన కాస్త ఎక్కువ. ఒకరోజు అనుకొని వెళ్లినవాడ్ని మరోరోజు ఉండాల్సివస్తే అక్కడ నేను కోరుకునే ప్రేమ, ఆప్యాయతలు లభిస్తే వాటికి కట్టుబడిపోతాను. శాశ్వతంగాని ఈ జీవితంలో అందమైన అనుభూతుల్ని ఏరుకొని హృదయంలో పదిల పరుచుకోవడం నాకెంతో ఇష్టమైన విషయం. చేస్తున్న ఉద్యోగం కంటే మంచి మనసున్న మనుషులకు వారి మనస్తత్వాలకు ప్రాధాన్యత యివ్వడమే నానైజం.

ఆ రోజు ఉపేందం అతని ఫ్రెండ్ పక్కింటి హరి మాడ్లాడుకుంటున్నాం...గేటు తీసుకుని వస్తున్న ఆమెను పిలిచి నాకు పరిచయం చేశాడు ఉపేందర్.

"పేరు బంగారి. మా ఇంట్లో పనిచేస్తుంది. అప్పట్లో వచ్చిన సునామీలో అన్ని కోల్పోయి బ్రతుకు తెరువుకోసం ఇటువచ్చింది. నాలుగిళ్లల్లో పనిచేసుకుంటుంది. ఒకకొడుకు...అతనికీ ఈ మధ్యనే పెళ్లి చేసింది."

చేతులు జోడిస్తూ చిరునవ్వు నవ్వింది బంగారి. ఆ చిరునవ్వులో నాకేదో జ్ఞాపకం. బంగారి వెళ్లిపోయింది. తెల్లగా బక్క పలుచగా లేత తమపాకులా అంతపొడుగు పొట్టికాని ఆకారంలో నా కుందనపు బొమ్మలా అన్పించింది.


"ఆవిడ వయసు డెబ్బయ్ సంవత్సరాలు" అన్నాడు ఉపేందర్. "అవునా" ఆశ్చర్యపోయాను నేను.

అక్కడవున్న నాలుగురోజులు బంగారితో చాలా సార్లే మాట్లాడాను..బంగారి నాకూ ఎంతగానో నచ్చింది. వచ్చేటప్పుడు బంగారికి యాభైరూపాయలు ఇవ్వబోయాను. వద్దంటే వద్దంది. చనువుగా బంగారి చేతినిలాగి ఆ చేతిలో యాభైరూపాయిలు ఉంచి బిగించి కొన్ని క్షణాలు ఆమెనే చూశాను. అదే చిరునవ్వు.

మరో రెండు నెలలకే ఉపేందర్‌కి హైద్రాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. ఎవరి బిజీవాళ్లది. ఉద్యోగాలలో పని వత్తిడి...బంగారి నా మస్తిష్కం నుంచి కాస్త దూరమైందనే చెప్పాలి. కోదాడ ట్రాన్స్‌ఫర్ అయిందనే సరికి నాకు ముందుగా గుర్తుకు వచ్చింది బంగారియే. బంగారి ఎక్కడవున్నా వెతికి పట్టుకుని నా ఇంట్లో పనికి పెట్టుకోవాలని ఓ ఇష్టమైన దృఢ సంకల్పం.

బ్యాంకులో జాయిన్ అయ్యాను. హరి అతని ఫ్రెండ్ సుధాకర్ సహాయంతో మరో పదిహేనురోజుల్లో మంచి ఇల్లు సంపాదించుకున్నాను. నా భార్య పావని చాలా మంచి మనసున్న మనిషి. పిల్లల్దిరూ దూరంగా ఇంజనీరింగ్ చదవడంతో మేము ఇద్దరమే రావడం జరిగింది.

కొత్త ఊళ్లో కాస్తా 'బోరు'గానే అన్పించింది. ఇద్దరికి ఏ మాత్రం సమయం దొరికినా బండిమీద ఊళ్లో ఉన్న రామాలయానికి, సత్యసాయి బాబావారి మందిరానికి, ఈ మధ్యనే కొత్తగా కట్టారని తెల్సిన వినాయకుడి గుడికి ఊరికి అటు చివర్న ఉన్న రంగడి గుడికి



అప్పుడప్పుడూ సినిమాలకి వెళ్తుండేవాళ్లం...

రోజులు గుడుస్తున్నా వేటమాత్రం ఫలించలేదు...అదే బంగారిని పట్టుకోలేక పోవటం. ఆ రోజు జాయిన్ కాగానే డైరెక్ట్‌గా వారి ఇంటికి వెళ్లాను. నాలుగు మాటలు మాట్లాడి బంగారి గురించి అడిగాను.

"అప్పట్లో పని చేసింది తర్వాత ఐదారుగురు పనిమనుషులు మారారు...మీకు పనిషి కావాలా...నామిసెస్ మాట్లాడి పెడుతుందిలెండి..." తెలిగ్గా అన్నాడు హరి... మరికాసేపు మాట్లాడి బయటపడ్డాను. ఆ తర్వాత నాకు ఇల్లు చూడడంలో సహాయపడిన సుధాకర్ ఇంట్లో కూడా బంగారి కొద్ది రోజులు పనిచేసిందని తెల్సుకున్నాను.

"సారీ... మీకు బంగారి ఎక్కడన్నా తారసపడితే నాకు తెలియజేయండి...ప్లీజ్..." నా అభ్యర్థనకి అతను కాస్త విచిత్రంగానే చూశాడు.

నాకు బ్యాంకులో పని వత్తిడి బాగా పెరిగింది. ఇరవై సంవత్సరాల్రక్రితం బ్యాంకు జాబ్ కాస్త హాయిగానే అన్పించేది. రానురాను రకరకాల ప్రెషర్సు...అలా కూడా నెట్టుకొచ్చాను ఉద్యోగాన్ని... పది సంవత్సరాల క్రితం నాకు హై.బి.పి.వచ్చింది. ఈ ఉద్యోగం నన్ను తినేసేట్టుంది అనుకున్న సమయంలోనే యోగా మెడిటేషన్...వాకింగ్ వగైరాలు మొదలు పెట్టాను...నేను అనుకున్న దొక్కటే ఉద్యోగ విషయంలో టెన్షన్ పడి నేను అనారోగ్యం పాలుగావద్దని... పని చేయాలి తప్పదు...తప్పనిది అని తెల్సినప్పుడు ఎదురీదటమే ఇప్పుడు ఇంకా పని పెరిగింది. ఇంత చిరాకులో ఇంత పట్టణంలో బంగారిని వెతికి పట్టుకోవడం ఎలా? ఇదే నా నిరంతర ఆలోచన..

"ఏమండీ పనిమనిషిని పెట్టుకోవద్దా?" అడిగింది పావని... "నాలుగు రోజులు చూద్దాం పావనీ..బంగారిని తప్పక కనిపెడతాను" ఏదో నమ్మకం కలగగా ఖచ్చితంగా చెప్పాను పావనితో... నా ఆజ్ఞశిర సావహిస్తూ అన్ని పనులు తానే చేసుకోసాగింది పావని... పది రోజులు గడిచాయి.

"రాజారావుగారూ రాజా రావుగారూ..." బయటినుండి కేక. బయటకు వచ్చిన నేను అలాగే నిలబడి పోయాను క్షణకాలం... నా నమ్మకం వమ్ముగాలేదు. ఎదురుగా బంగారి ప్రక్కన సుధాకర్

బంగారిని చూసిన ఆనందంలో సుధాకర్‌కి విష్ చేయటం కూడా మర్చి పోయాను.

"బంగారీ" ఆనందంగా ముందుకు నాలుగంగలు వేసి ఆత్మీయంగా బంగారీ చేయిపట్టుకున్నాను...

"బాగున్నరాయ్యా" అంటూ చిరునవ్వు నవ్వింది బంగారి

"నేను గుర్తున్నానా బంగారీ"

మీరే గుర్తు పెట్టుకోగాలేంది నేను గుర్తుపెట్టుకోనా అయ్యా..."

"సారీ సుధాకర్ గుడ్‌మార్నింగ్ వెరీసారీ" అన్నాను కాస్త సిగ్గుగా ఫీలవుతూ...

"మరేం ఫర్వాలేదు... నేను మళ్లీ కలుస్తాను సార్...బంగారి బజార్లో కన్పించింది మీరు అంతగా అడుగుతున్నారని స్కూటర్‌మీద ఎక్కించుకుని వచ్చాను" అంటూ వెళ్లబోతున్న అతనికి థ్యాంక్స్ చెప్పాను.

"పావనీ" అంటూ కేకేసి బంగారిని పరిచయం చేశాను. నాలో కొత్త ఉత్సాహం ఉరకలు వేసింది.

పావనితో టీ తయారు చేయించి నేనే స్వయంగా బంగారికి ఇచ్చాను. మొహమాటపడుతూ ఎంతో ఇబ్బందిగా 'టీ' తాగింది బంగారి.

"బంగారీ నువ్వు మా ఇంట్లో పని చేయాలి...ఛీ ఛీ... పని అనిగాదు మా ఇంట్లో ఒక వ్యక్తిగా ఉండాలి." అంటూ ఎంతో ప్రేమగా అడిగాను.

మళ్లీ అదే చిరునవ్వు...

"నాకు ఎట్లా కుదురుతుందయ్యా... ఆ మూలన మేముంటాం..ఈ మూలన మీరుంటారు. రావటం కష్టంగదా అందులో పెద్ద దాన్ని"

"ఇల్లు దేముంది బంగారీ...మార్చేస్తాం...నీకు దగ్గరగా ఉండేట్లు ఇంకో ఇల్లు తీసుకుంటాం."

పావనితోపాటు బంగారి తెల్లబోయింది. అన్నట్లుగానే ఇల్లు మార్చాను.. బంగారి మా ఇంట్లో పనికి కుదిరింది. అప్పుడుగాని నా మనసుకు శాంతి దొరకలేదు.

000

నెలరోజులు గడియాయి నాకంటే పావని ఇంకా బాగా చూసుకోసాగింది బంగారిని. బంగారి మనస్తత్వం అట్లాంటిది. మెత్తగా మాట్లాడుతుంది. ఏ మాత్రం నొప్పించదు. ఎంతో పరిశుభ్రంగా ఉంటుంది. అంతకంటే పరిశుభ్రతగా పనులు చేస్తుంది. అమ్మా, అయ్యా అంటూ అభిమానంగా పిలుస్తుంది. పైగా ఆత్మాభిమానం ఒకటి... ఏ చిన్న సహాయం చేయబోయినా తిరస్కరిస్తుంది.

> పెళ్లయి నాలుగేళ్లయినా పిల్లలులేరని దాని ఏడుపు...పిల్లలు లేకుంటే ఏందయ్యా... ఏ అనాథ పిల్లాడినో పిల్లనో పెంచుకుంటే ఏమయింది? ఎంతమది పసికూనలు మురిక్కాలువల్లో చెత్తకుండీల్లో పెంటల్లా పారేయపడుతున్నారు? ఏం వాళ్లని అక్కున చేర్చుకోగూడదా? పొత్తిళ్లలో పెట్టుకోకూడదా..

రోజులో రెండు మూడు సార్లయినా బంగారి గురించి ప్రస్తావన మా ఇద్దరి మధ్య వస్తుండేది.

ఆ రోజు ఆదివారం నేను పావని తీరిగ్గా పేపర్ చూస్తున్నాం...గేటు తోసుకుని వస్తున్న బంగారి మా ఇద్దర్ని చూసి చిరునవ్వు నవ్వింది

"బంగారీ ఇలారా పిలిచాను నేను

"ఏంటయ్యా"

నా మనసులో రోజు రోజుకి బలపడుతున్న నిర్ణయాన్ని ఆమె ముందుంచాను.

"బంగారీ మా ఇంట్లో ఉండరాదా"

మళ్లీ అదే చిరునవ్వు..

"ఎట్లాకుదురుతుందయ్యా..నాకూ ఓ కొడుకు, వాడికి భార్యా సంసారం ఉందిగదా"

"నువ్వు ఇక్కడికి అప్పుడప్పుడు వచ్చినట్లుగా అక్కడికి అప్పుడప్పుడు వెళ్లవుగాని... నీ కొడుకు, కోడలుతో నేను మాట్లాడుతాను" ఆరాటంగా అన్నాను..

"లేదు లెండయ్యా...అట్లా వద్దులెండి...ఇప్పటికీ అమ్మ మీరు నన్ను ఎంతో బాగా చూసుకుంటున్నారు... ఈ సంతోషం నాకు చాలు..నాలుగిళ్లల్లో పని చేసేసరికి సమయం అయిపోతుంది...మళ్లీ సాయంత్రం అన్ని ఇళ్లల్లో పనిచేయాలి. సమయం చాలదు లేయ్యా..."

"నువ్వు సంపాదించేది ఎంతో చెప్పు...అంతా నేనే ఇస్తాను నా ఇంట్లోనే నువ్వుండు..ఇలా బాగానే ఉంటుంది...అమ్మకు తోడుగా ఉన్నట్లుంటుంది. నా మనసుకు ఎంతో సంతోషంగా ఉంటుంది"ఆశగా అన్నాను.

"వద్దులేయ్యా...మీ ఇంట్లో అంతగా ఏం పని ఉందని? ఈ కొద్ది పనికి అంత జీతం నేనెట్లా తీసుకుంటాను..గడిచిపోతుందిగా..ఇట్లాగే గడిచి పోనీండి"

బంగారి ఆత్మాభిమానం మా ఇద్దరికీ కాస్త బాధ కలిగించింది...పని చూసుకోటానికి బంగారి ఇంటి వెనక్కి వెళ్లిపోయింది.

"అబ్బో-బంగారి చాలా లోతైన మనిషండీ...ఏదీ చెప్పదు ఈ మధ్యనే నాతో కాస్త చనువు ఏర్పడింది. అదో ఇదో నేను వాగుతూనే ఉన్నాను గాని ఇదిగో అన్నింటికి ఇదే చిరునవ్వు" అంది పావని...నేను ఆలోచనలో పడిపోయాను.

గేటు చప్పుడైంది. అటు చూశాను నేను

'అయ్యా...మా అమ్మ...ఉందాయ్యా...అదే...బంగారి..." అర్థమైంది నాకు అతనెవరో...

"నువ్వు బంగారి కొడుకువి ఏసోబువి అవునా"

అవునయ్యా..." అంటూ చేతులు జోడించాడతను

"ఇంటివెనకుంది వెళ్లు.."

ఐదు నిముషాల తర్వాత ఇద్దరూ ఇంటి ముందుకు వచ్చారు. అయ్యా...ఓ ఏ భైరుపాయలు ఇవ్వండయ్యా... జీతంలో చూసుకుందురుగాని..." అంది బంగారి... లోపలికి వెళ్లి ఏభైరూపాయిలు తెచ్చి ఇచ్చాను. బంగారి ఏసోబుకి ఇచ్చింది...మరోసారి చేతులు జోడించి వెళ్లిపోయాడు ఏసోబు...

బంగారి పనులన్ని అయిన తర్వాత టిఫిన్ పెట్టి 'టీ' పోసింది పావని...

"అమ్మా...అన్నం మిగిల్చకండి...ఎంత కావాలో అంతే వండుకోండి ఒకముద్ద తక్కువైతే అయింది నాలుగు బియ్యం గింజలు తక్కువే పోసుకోండి. అన్నం కాలువలో పారబోస్తుంటే నాకెంతో బాధగా ఉంటుంది. అన్నం విలువ ఆకలి బాధ నాకు బాగా తెల్సు"...

నేను పావని ముఖముఖాలు చూసుకున్నాం. అప్పట్లో సునామీ వచ్చినప్పుడు అన్ని పోగొట్టుకుని ఇంత దూరం వచ్చి పడ్డాం...నా కొడుకు కూలీపని చూసుకుండు...వాడికి నేను భారం కాగూడదని నేనూ నాలుగిళ్లలో పనికి కుదిరాను... ఎవ్వరూ ఇంత తిండి పెట్టక పోయేవాళ్లు...వెచ్చాల ధరలు మండిపోతున్నాయని టిఫిన్లు, టీలు, భోజనం ఏవీ పెట్టమని జీతం ఒక్కటే ఇస్తామని కుదిరించుకున్నారు....కానీ రాత్రి మిగిలిన ఇంత ఇంత అన్నాలు..కూరలు పారోబోసేదనాన్ని ఎంతో బాధగా అన్పించేది...నా కొడుక్కి నాకు ఇద్దరికి సరిపోతాయన్పించేది...ఆ గిన్నెల్లో నీళ్లు పోయకండి..ఆ అన్నం నేను తింటాను అని ఎన్నోసార్లు చెప్పాలనుకునే దాన్ని...కానీ వాళ్లకు నేను అనుకూలంగా ఉండాలి గాని నాకు అనుకూలంగా వాళ్లుండరు కదా... ప్చ్...ఏం మనుషులో దానం చేయ బుద్ధిగాదుగాని దండగ పెట్టబుద్ధవుతది... ఏవో పిండి వంటలు చేసుకున్నా చేసుకున్న రోజు ఎవ్వరూ పెట్టకపోయేవాళ్లు...అవి అయిపోతాయనగా ఒకటో రెండో ఇచ్చేవాళ్లు...అప్పటికే దానికి రుచి మారిపోయి వుండేది..అదీ నేను తినకపోయేదాన్ని నా కొడుక్కి పట్టుకెళ్లేదాన్ని"



నాలో ఏదో పరవశం...'బంగారి ఇన్నాళ్లకు తనంత తానుగా తన గురించి చెప్పుకుంటోంది. అదీ మా నుండి ఎలాంటి ప్రేరణ లేకుండానే ఏసోబు వచ్చాడు... బంగారి పెదవి విప్పింది...ఏసోబు బంగారి మనసుని చదివాడు...అందుకే మాటలు ఇలా బయట పడుతున్నాయి...ఇంతకూ ఏసోబు బంగారి ఏం మాట్లాడుకుని ఉంటారు? ఏదో జరిగింది...ఏం జరిగింది?'

'నీ కోడలు" తెలివిగా ఇంకా రాబట్టే ప్రయత్నం చేస్తోంది పావని...

"అదో నిక్కచ్చరం...వాడ్ని పట్టి పీడిస్తోంది" ముఖం ఎరుపు రంగు రాగా కోపంగా అంది...

నాకెంతో ఆనందంగా ఉంది. బంగారి అలా మనసు విప్పి మాట్లాడుతుంటే నామనసుకేదో ప్రశాంతత దొరుకుతున్నట్లయింది.

"నేను ఎప్పుడూ ఇట్లా ఎంతో చెప్పలేదు ఎంతో మన మనసులు ఇట్లా కలిసిపోయినయ్.'

నా మనసు సంతృప్తితో నిండిపోసాగింది.

'నా కొడుకు చూశాడు గదా... ఎంత అందంగా ఉన్నాడు? ప్రేమ ప్రేమ అంటూ వాడి వెంటపడింది. కాకి ముక్కుకు దొండపండు అంటారు గదయ్యా...అట్లుంటది...పొద్దున చూస్తే మాపటికి కళ్లో కొస్తది... అయినా అందం ఏముందిలే మనసుగదా గొప్పగ వుండాల్సిది అనుకున్నాను. ముఖ్యంగా వాడు ఇష్టపడ్డడు. పెళ్లిచేశాను.

ఏదో సంసారం సాగించారు. పెళ్లయి నాలుగేళ్లయినా పిల్లలులేరని దాని ఏడుపు...పిల్లలు లేకుంటే ఏందయ్యా... ఏ అనాథ పిల్లాడినో పిల్లనో పెంచుకుంటే ఏమయింది? ఎంతమది పసికూనలు మురిక్కాలు వల్లో చెత్తకుండీల్లో పెంటల్లా పారేయపడుతున్నారు? ఏం వాళ్లని అక్కున చేర్చుకోగూడదా? పొత్తిళ్లలో పెట్టుకోకూడదా...ఓ జీవితానికి ఆధారం చూపించినట్లవుతుందిగా...అహా అట్టగాదు...తన సొంతంగా కావాలి...ఓ...ఒకటేగోల...వాడ్ని నానా ఇబ్బంది పెడుతుంది...సరిగ్గా తిండి పెట్టదు నిద్రపోనీయదు..పిచ్చి సన్నాసి...కూలీ పనిమీద వేరే ఊరు పోయిండు ఈ రెండు రోజుల డబ్బు ఇవ్వాలి చీరెకొనుక్కోవాలి అని పేచీ పెట్టిందట...వీడు కడుపు మార్చుకున్నాడు...నిన్న మొన్న తిండి లేదు...సంపాదించింది దానికి ఇవ్వాలాయె... ఇంక వాడేం తింటాడు? కడుపు నిండా ఇష్టమైనవి హోటల్లో తినమని డబ్బిచ్చాను... ఇదిగో ఇట్లా వేపుకు తింటదయ్యా..."

"మీరు మెత్తటోళ్లు...అందుకే దాని ఆటలు అలాసాగుతున్నయ్..." కాస్తకోపంగా అంది పావని...

"అమ్మో...దాన్ని ఏమనకుంటేనే మమ్మల్ని రాచిరంపాన పెడుతుంది...ఏ కొద్దిగా అటూ ఇటూ అయినా నా మీద కిర్సనాయిలు పోసి మంటబెట్టిబోయింద్రు అని పోలీసులకు చెప్పదూ...ఇక బ్రతికినంత కాలం జైల్లో మగ్గాలి నేను నాకొడుకు...మంచి చేయబోతే చెడు ఎదురయింది అంటే ఇదిగో ఇట్లాగే ఉంటుంది" అంటూ మధ్య మధ్య కళ్లు అద్దుకుంటున్న బంగారి ఒక్కసారిగా ఏడ్చేసింది.

మా ఇద్దరి మనసులు చలించిపోయాయి...నేను పావనితో మాట్లాడి ఒక ఆలోచనచేశాను..కొడుకు కోడల్ని పిలిపించాను...వాళ్లు వచ్చారు. వాళ్లతో ఎంతో పద్ధతిగా విశ్లేషించి మాట్లాడాను. మీ ఇద్దరినీ హాస్పిటల్లో చూపిస్తాను..పరీక్షలు చేయిస్తాను...ఆ ఖర్చు నేను భరిస్తాను అని చెప్పాను...

ఇక్కడ సరే అని ఇంటికి వెళ్లి నానా గొడవ చేసిందట బంగారి కోడలు మంగ... 'లోపం ఉంటే నీ కొడుకులో ఉంటుందిగాని నాలో ఉండదు అయినా మన విషయాలు వాళ్లతో చెప్పటం ఏంటి? అసలు నువ్వు పనికెళ్లకు అంటూ కట్టడి చేసిందట...

అదీ బంగారి చెప్పలేదు ఆ విషయం..బంగారి నాలుగు రోజులు పనికి రాకపోయే సరికి నేను బండేసుకుని బంగారి ఇంటికి వెళ్లాను...తలుపు తాళం వేసి ఉండటంతో దిక్కులు చూస్తున్న నాతో పక్కింటావిడ చెప్పిందీ విషయం.

సశేషం